వాయిస్ అఫ్ ప్రజలు

# వాయిస్ టుడే

TGTEL/25/A2649

www.Voicetodaynews.com

https://epaper.voicetodaynews.com

జనగాత్రం - మననేత్రం

Follow

పేజీలు 10

సోమవారం, డిసెంబరు 1, 2025

HYDERABAD RANGAREDDY NALGONDA MAHABOOBNAGAR MEDAK KHAMMAM KARIMNAGAR WARANGAL NIZAMBAD ADILABAD

## భారతీయ నిపుణులతో అమెరికాకు గొప్ప లాభం: ఎలాన్ మస్క్



వాషింగ్టన్: అనేక సంవత్సరాలుగా భారతీయ ప్రతిభావంతులను నియమించుకుంటూ అమెరికా అత్యధిక లబ్ధిని పొందిందని ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ అన్నారు. జెరోధా సహ వ్యవస్థాపకుడు నిఖిల్ కామత్ నిర్వహించిన 'పాడ్‌కాస్ట్‌లో ఆదివారం ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ గతంలో దుర్వినియోగమైనందువల్ల, గత ప్రభుత్వాలు అత్యంత ఉదాసీనంగా వ్యవహరించినందువల్ల అమెరికాలో వలసలకు వ్యతిరేక భావాలు ఉత్పన్నమయ్యాయని తెలిపారు. జో బైడెన్ అడ్మినిస్ట్రేషన్‌లో సరిహద్దుల్లో ఎటువంటి నియంత్రణ ఉండేది కాదని, అందరూ స్వేచ్ఛగా అమెరికాకు వచ్చేవారని చెప్పారు.



# ట్రిపుల్ ఆర్‌కు కేంద్రం ఆమోదం

## సంక్షోభాలకు తావు లేకుండా 'క్యూర్'

ఓఆర్ఆర్ లోపలి ప్రాంతాన్ని నెట్-జీరో సిటీకుగా మలిచే మహా ప్రణాళిక

హైదరాబాద్ భవిష్యత్‌కు క్యూర్-ప్యూర్-రేర్ మోడల్‌తో కొత్త దిశ

విజన్ డాక్యుమెంట్-2047లో పట్టణాభివృద్ధికి వ్యూహాత్మక దిశానిర్దేశం

గ్రీన్‌ఫీల్డ్ హైవేలు, బుల్లెట్ ట్రెయిన్ ప్రాజెక్టులకు వేగం: సీఎం రేవంత్

హైదరాబాద్ : హైదరాబాద్ పట్టణా భివృద్ధిని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా మార్చేందుకు ప్రభుత్వం సమగ్ర దిశా నిర్దేశంతో ముందుకు సాగుతోంది. ఔటర్ రిం గ్ రోడ్డు లోపలి ప్రాంతాన్ని కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీగా విభజించి, ఈ పరిధిని నెట్-జీరో సిటీగా మార్చడమే ప్రభుత్వ లక్ష్యమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తెలిపారు. దేశంలోని ప్రధాన నగరాలు ఎదుర్కొంటున్న కాలుష్యం, వరదలు, శాంతిభద్రతల వంటి సమస్యలు హైదరాబాదును ప్రభావితం చేయకుండా ముందుగానే నివారణాత్మక పట్టణ ప్రణాళికను అమలు చేస్తున్నామని చెప్పారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తికానుండగా, డిసెంబర్ 8, 9 తేదీల్లో జరిగే 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్'కు సంబంధించిన ఏర్పాట్లు, విడుదల కానున్న విజన్ డాక్యుమెంట్-2047 రూపకల్పనపై సీఎం సచివాలయంలో

(మిగతా 2వ పేజీలో)

# ప్రజల సంపదను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చింది



## రాహుల్ గాంధీకి కేటీఆర్ ఓపెన్ లేఖ

హిల్ట్‌పి పేరిట కాంగ్రెస్ 5 లక్షల కోట్ల భూ దందా చేస్తున్నదని ఆరోపణ

రాహుల్ స్పందించకపోతే ఈ వ్యవహారంలో ఆయనకూ ప్రమేయం ఉన్నట్టే

బహిరంగ లేఖలో కేటీఆర్ తీవ్ర విమర్శలు

హైదరాబాద్: తెలంగాణకు చెందిన రూ.5 లక్షల కోట్ల విలువైన పబ్లిక్ ప్రాపర్టీని కాంగ్రెస్ పార్టీకి ఆదాయ వనరుగా మార్చేందుకు చేసిన ప్రయత్నాన్ని బీఆర్ఎస్ ఎట్టి పరిస్థితుల్లోనూ అంగీకరించబోదని పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రజల భవిష్యత్తును కాంగ్రెస్ పార్టీకోసం పణంగా పెట్టడం అంగీకారయోగ్యం కాదని, దీని వ్యతిరేకంగా బీఆర్ఎస్ తరపున పోరాటం కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ విషయమై కేటీఆర్ ఆదివారం కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీకి బహిరంగ లేఖ రాశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రవేశపెట్టిన హైదరాబాద్ ఇండస్ట్రియల్ ల్యాండ్ ట్రాన్స్‌ఫర్మేషన్ పాలసీ (హిల్ట్‌పి) భారతదేశంలోనే అత్యంత పెద్ద భూకేసులలో ఒకటిగా నిలుస్తుందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలో జరుగుతున్న అక్రమాలన్నీ కాంగ్రెస్ నాయకత్వం చూసినా చూడనట్టుగా ఉందా? లేదంటే అసలు తెలియదా?" అని కేటీఆర్ లేఖలో ప్రశ్నించారు. ఈ విధానం వల్ల అత్యంత విలువైన ప్రభుత్వ భూములు ప్రైవేట్ కంపెనీలకు అతి తక్కువ ధరకు పూర్తిగా సొంతం కావడానికి అవకాశం ఉంటుందని అన్నారు. ఫలితంగా రాష్ట్రానికి కనీసం రూ.5 లక్షల కోట్ల నష్టం తప్పదని ఆయన వివరించారు. గత ప్రభుత్వాలు హైదరాబాద్‌లోని కీలక ప్రాంతాల్లో

(మిగతా 2వ పేజీలో)

# మొదటి విడతలో నామినేషన్ల వెల్లువ

## సర్పంచ్ పోస్టులకు 25,654 మంది పోటీదారులు

వార్డు స్థానాలకు 82,276 నామినేషన్లు

చివరి రోజు రాత్రివేళల వరకూ కొనసాగిన దాఖలు ప్రక్రియ

జిల్లా వారీగా సర్పంచ్, వార్డుల్లో తీవ్ర పోటీ వాతావరణం

డిసెంబర్ 3 వరకు ఉపసంహరణ గడువు, 11న పోలింగ్

రెండో విడత నామినేషన్లు కూడా ప్రారంభం



హైదరాబాద్ : తొలి విడత పంచాయతీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా నామినేషన్ల దాఖలు శనివారంతో ముగియగా, ఆఖరి రోజున అభ్యర్థుల స్పందన విశేషంగా కనిపించింది. గురువారం, శుక్రవారం నామినేషన్ల స్వీకరణ మందగమనంలో సాగినప్పటికీ, మంచి రోజు కావడంతో మధ్యాహ్నం తర్వాత పెద్ద సంఖ్యలో అభ్యర్థులు పంచాయతీ కార్యాలయాలకు చేరుకోవడంతో రాత్రి దాకా నామినేషన్ల పరంపర కొనసాగింది. సాయంత్రం 5 గంటల వరకు క్యూలైన్‌లో నిలిచిన వారికి అధికారులు టోకెన్లు ఇచ్చి

(మిగతా 2వ పేజీలో)



## మరో 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

::: మావోయిస్టు సంస్థకు మరో భారీ షాక్



## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

## 11మంది దుర్మరణం

శివగంగ జిల్లా తిరుపత్తూర్ సమీపంలో ఘటన

కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో పెరగనున్న మృతుల సంఖ్య

వారం రోజుల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద బస్సు ప్రమాదం

## నేటి నుంచే శీతాకాల పార్లమెంట్ సమావేశాలు

డిసెంబర్ 19 వరకు కొనసాగనున్న పార్లమెంట్

'ఎస్ఐఆర్‌'పై కేంద్రాన్ని నిలదీయనున్న విపక్షాలు

ప్రధాన అంశాలను చర్చకు తెచ్చే వ్యూహం



న్యూఢిల్లీ: శీతాకాల సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. డిసెంబర్ 19 వరకు మొత్తం 15 రోజులపాటు ఈ సమావేశాలు కొనసాగనున్నాయి. సోమవారం ఉదయం 11 గంటలకు లోక్‌సభ, రాజ్యసభలు ప్రారంభమవుతాయి. ముందుగా మరణించిన ఎంపీలకు సంతాపం తెలుపుతారు. ఆ తరువాతే అధికారిక కార్యక్రమాలు మొదలవుతాయి. దేశంలోని పలు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటర్ల జాబితా

(మిగతా 2వ పేజీలో)



## సోనియా-రాహుల్‌పై మరో ఎఫ్ఐఆర్

## భారత క్రీడారంగానికి ఇది 'సూపర్ హిట్' నెల: 'మన్‌కీబాత్'లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం



మహిళల క్రికెట్, కబడ్డీ ప్రపంచకప్‌ల విజయాలపై ప్రత్యేక అభినందనలు

అంధుల మహిళా క్రికెట్ జట్టు విజయం చరిత్రలో నిలిచిపోతుందన్న ప్రధాని

డెఫ్లింపిక్స్, వరల్డ్ బాక్సింగ్‌లోనూ పతకాల పంట పండించిన క్రీడాకారులు

విజేతల ధైర్యం, పట్టుదల దేశానికే స్ఫూర్తిదాయకమని వ్యాఖ్య

# ట్రిపుల్ ఆర్‌కు కేంద్రం ఆమోదం

సమీక్షించారు. ఈ దస్త్రం రాష్ట్ర భవిష్యత్‌ను క్యూర్, ప్యూర్, రేర్ అనే మూడు విభాగాల్లో విభజించి రూపొందించబడిందని, లక్షలాది మంది ప్రజల అభిప్రాయాలతో పాటు విశ్వస్థాయి నిపుణుల సూచనలతో ముసాయిదా సిద్ధమైందని చెప్పారు. ఓఆర్ఆర్ లోపలి 2,170 చదరపు కిలోమీటర్ల పరిధిని సేవారంగ కేంద్రంగా అభివృద్ధి చేస్తూ కాలుష్యకర పరిశ్రమలను బయటకు తరలించేందుకు చర్యలు చేపడతామని సీఎం వివరించారు. మూసీ ప్రక్షాళన, చెరువుల సంరక్షణ, రోడ్ల విస్తరణ, మెట్రో విస్తరణ వంటి కీలక నగరాభివృద్ధి కార్యక్రమాలు ఈ దశలో అమలు కానున్నాయని తెలిపారు. ఓఆర్ఆర్ వెలుపల నిర్మించనున్న రీజినల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) ప్రాజెక్టుకు కేంద్రం సూత్రప్రాయ ఆమోదం ఇచ్చిందని, 320 కి.మీ పొడవుతో నిర్మించబోయే ఈ రింగ్ రోడ్ హైదరాబాద్‌కు రెండో మణిహారంగా నిలుస్తుందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఆర్ఆర్ఆర్%-%ఓఆర్ఆర్ మధ్య ప్రాంతాన్ని ప్యూర్ జోన్‌గా అభివృద్ధి చేసి పెట్టుబడులకు ప్రత్యేక విధానాలు అమలు చేస్తామని చెప్పారు. హైదరాబాద్%-%బెంగళూరు, హైదరాబాద్%-%అమరావతి, అమరావతి%-%చెన్నై మధ్య గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్ హైవేలు, బుల్లెట్ ట్రెయిన్ ఏర్పాటుకు కూడా కేంద్రం సూత్రప్రాయ సమ్మతి తెలిపిందని వెల్లడించారు. ప్యూర్ జోన్‌ను మచిలీపట్నం పోర్టుతో అనుసంధానించి ఎగుమతి%-%దిగుమతులకు మెరుగైన అవకాశాలు కల్పించనున్నామని అన్నారు. వరంగల్‌లో కొత్త అంతర్జాతీయ విమానాశ్రయం, అదిలాబాద్, కొత్తగూడెం, రామగుండంలో విమానాశ్రయాల ఏర్పాటుతో రాష్ట్ర కనెక్టివిటీ మరింత బలోపేతం అవుతుందని వివరించారు. 2030ల వరకే కాకుండా, 2047లో దేశం 100 ఏళ్ల స్వాతంత్ర్యోత్సవాలను జరుపుకునే నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా తీర్చిదిద్దాలన్నదే తమ ప్రభుత్వ లక్ష్యమని సీఎం స్పష్టం చేశారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలోని 5% వాటాను కనీసం 10% శాతానికి పెంచేందుకు ప్రపంచ



దేశాలతో పోటీ చేసే అభివృద్ధి నమూనాను అమలు చేయనున్నట్లు తెలిపారు. నాలెడ్జ్ హబ్‌గా విద్యా వ్యవస్థను మారుస్తూ అంతర్జాతీయ విద్యాసంస్థలను తీసుకురావడంపై ప్రణాళికలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. డిసెంబర్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ప్రజాపాలన ఉత్సవాలను నిర్వహించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. మక్తల్, కొత్తగూడెం, హుస్నాబాద్, ఆదిలాబాద్, నర్సంపేట, దేవరకొండలలో జరిగే ఈ ఉత్సవాల్లో సీఎం పాల్గొంటారని చెప్పారు. 7న ఉస్మానియా విశ్వవిద్యాలయంలో విద్యా అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం, 8, 9 తేదీల్లో గ్లోబల్ సమ్మిట్, 13న మెస్సీ ఆడే ఫ్రెండ్లీ మ్యాచ్ రాష్ట్ర ప్రజలను ఆకట్టుకోనున్న ముఖ్య కార్యక్రమాలుగా పేర్కొన్నారు.

# మొదటి విడతలో నామినేషన్ల వెల్లువ




అర్ధరాత్రి వరకూ దాఖలు ప్రక్రియను కొనసాగించారు. దీంతో ఆదివారం ఉదయం వరకు వచ్చిన వివరాల ఆధారంగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ తొలి విడత నామినేషన్ల తుది గణాంకాలను ప్రకటించింది. మొత్తం 4,236 పంచాయతీల్లో సర్పంచ్ పదవుల కోసం 25,654 మంది నామినేషన్లు దాఖలు చేశారు. 37,440 వార్డు సభ్య స్థానాలకు 82,276 మంది పోటీకి వచ్చారు. సర్పంచ్ స్థానాల విషయంలో సూర్యాపేట జిల్లా అత్యధిక నామినేషన్లను నమోదు చేసింది. 159 పంచాయతీలకు 1,387 నామినేషన్లు దాఖలుకాగా, వికారాబాద్‌లో 1,383, మహబూబాబాద్‌లో 1,239, కామారెడ్డిలో 1,224, రంగారెడ్డిలో 1,169 నామినేషన్లు నమోదయ్యాయి. వార్డు సభ్య స్థానాలకు రంగారెడ్డి జిల్లాలో నామినేషన్ల వెల్లువ మరింతగా కనిపించింది. 1,530 వార్డులకు 4,540 మంది నామినేషన్లు వేయగా, వికారాబాద్‌లో 4,379, ఖమ్మంలో 4,041, కామారెడ్డిలో 3,832, సూర్యాపేటలో 3,791 నామినేషన్లు దాఖలయ్యాయి. ఆదివారం నామినేషన్ల పరిశీలన పూర్తి కాగా, తిరస్కరించిన నామినేషన్లపై సోమవారం సాయంత్రం వరకు అప్పీలు చేసుకునే అవకాశం ఉంది. మంగళవారం వాటిని పరిశీలించి తుది నిర్ణయాలు తీసుకోనున్నాయి. డిసెంబర్ 3 మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉండగా, అదే రోజు పోటీలో ఉన్న అభ్యర్థుల తుది జాబితాను అధికారులు విడుదల చేస్తారు. డిసెంబర్ 11న తొలి విడత పోలింగ్ జరగనుంది. రెండో విడత పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల స్వీకరణ ఆదివారం నుంచే ప్రారంభమైంది. అర్ధరాత్రి వరకు దాఖలైన నామినేషన్ల సంఖ్యపై పూర్తి సమాచారం అందనప్పటికీ, రెండో విడతలో మొత్తం 4,333 సర్పంచ్, 38,350 వార్డు స్థానాలకు ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబర్ 2 వరకు నామినేషన్లు స్వీకరించబడతాయి. డిసెంబర్ 6న ఉపసంహరణ గడువు ఉండగా, డిసెంబర్ 14న పోలింగ్ నిర్వహించి అదే రోజు ఫలితాలు ప్రకటించనున్నారు.

# నేటి నుంచే శీతాకాల పార్లమెంట్ సమావేశాలు

ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను ప్రతిపక్షాలు కడా వ్యతిరేకిస్తున్నాయి. ఈ అంశంపై పార్లమెంటులో చర్చ జరపాలని విపక్షాలు పట్టుబడుతున్నాయి. ఈ విషయంలో ప్రభుత్వం నిలదీయడానికి విపక్షాలు సంయుక్తంగా వ్యూహం రచిస్తున్నాయి. ఢిల్లీ కారుబాంబు పేలుడు నేపథ్యంలో దేశ భద్రతా వ్యవస్థలపై మోదీ ప్రభుత్వాన్ని ప్రశ్నించడానికి కూడా విపక్షాలు సిద్ధంగా ఉన్నాయి. అలాగే విదేశాంగ విధానంలో లోపాలు, ద్రవ్యోల్బణ పరిస్థితి, నిరుద్యోగం కొత్త లేబర్ కోడ్స్ బీజేపీ కాకుండా ఉన్న రాష్ట్రాలకు నిధులను ఆపడం ప్రజా సమస్యలు తదితర అంశాలను కూడా రాబోయే రోజుల్లో బలంగా ప్రస్తావించాలని నిర్ణయం తీసుకున్నారు. వందేమాతరం గీతం 150 ఏళ్లు పూర్తయిన సందర్భంలో పార్లమెంట్‌లో ప్రత్యేక చర్చ కూడా జరుగనుంది.

### పార్లమెంట్‌లో ప్రవేశపెట్టబోయే 14 కీలక బిల్లులు

ఈ సమావేశాల్లో కేంద్ర ప్రభుత్వం 14 బిల్లులను టేబుల్‌పై పెట్టనున్నది. వాటిలో ముఖ్యంగా మణిపూర్ జీఎస్టీ (రెండో సవరణ) బిల్లు-2025, కేంద్ర ఎక్సైజ్ (సవరణ) బిల్లు-2025, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు-2025, ప్రైవేట్ కంపెనీలకు అణు ఇంధన రంగంలో భాగస్వామ్యం కల్పించే చట్టం, సెక్యూరిటీస్ మార్కెట్ కోడ్ బిల్లు%-%2025, ఉన్నత విద్యా కమిషన్ బిల్లు%-%2025, జన్ విశ్వాస్ (నిబంధనల సవరణ) బిల్లు, దివాళా, దివాళా కోడ్ (సవరణ), పారదర్శక భూసేకరణ కోసం జాతీయ రహదారుల చట్టం (సవరణ), కంపెనీల చట్ట సవరణకు కార్పొరేట్ చట్టాల బిల్లులు ప్రభుత్వం చండీగఢ్‌కు రాష్ట్రపతి నేరుగా నిబంధనలు జారీ చేసే అధికారం ఇవ్వాలని ప్రతిపాదించిన బిల్లును, పలు పార్టీల అభ్యంతరాల తర్వాత ఉపసంహరించుకుంది.

### బీఏసీ సమావేశంలో ప్రతిపక్షాల సంపూర్ణ ఆగ్రహం

లోక్‌సభ, రాజ్యసభ బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాలు ఆదివారం జరిగాయి.



సమావేశాల మొదటి రోజే రాజ్యసభలో ఎస్ఐఆర్‌పై స్వల్పకాల చర్చ చేపట్టాలని ప్రతిపక్ష నేతలు కోరారు. రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్ నేతృత్వంలో భేటీ జరిగినప్పుడు, ప్రతిపక్షాలు సభ సజావుగా నడవడానికి సహకరిస్తామని చెప్పినా ఎస్ఐఆర్ అంశంపై చర్చ తప్పనిసరిగా జరగాలని స్పష్టం చేశాయి. సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు ఎన్నికల సంస్కరణలపై చర్చ జరగాలని సూచించారు. చర్చకు అవకాశం ఇవ్వకపోతే సభా కార్యకలాపాలకు అడ్డంకులు రావడానికి ప్రభుత్వమే కారణమని హెచ్చరించారు. డిసెంబర్ 19 వరకు సాగబోయే ఈ శీతాకాల సమావేశాలలో ఎస్ఐఆర్‌ను "ఎన్నికల సంస్కరణలు లేదా పారదర్శక ఎన్నికల ప్రక్రియ" పేరిట చర్చించవచ్చని ప్రతిపక్షాలు వ్యాఖ్యానించాయి.

# ప్రజల సంపదను కాంగ్రెస్ ఏటీఎంగా మార్చింది

9,300 ఎకరాల పారిశ్రామిక భూమిని పరిశ్రమల అభివృద్ధి కోసం కేటాయించాయని కేటీఆర్ గుర్తుచేశారు. కానీ హిల్ట్‌పి కింద ఆ భూములను అత్యల్ప ధరలకు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించి, వేల కోట్ల రూపాయల విలువైన భూమిని చట్టబద్ధం చేసే ప్రక్రియ ప్రారంభించారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం చూపుతున్న తొందరపాటు ఈ విధానంలో భారీ అవినీతి దాగి ఉన్నట్టు స్పష్టం చేస్తోందన్నారు. ఓఆర్ఆర్ వెలుపల ఉన్న కాలుష్య పరిశ్రమలను తరలించాలని కాంగ్రెస్ ప్రభుత్వం చెబుతున్నప్పటికీ, వాస్తవానికి వేల కోట్ల విలువైన భూములను చేజిక్కించుకోవడమే అసలు ఉద్దేశమని కేటీఆర్ పేర్కొన్నారు. తరలించాల్సిన పరిశ్రమలకు ప్రత్యామ్నాయ స్థలాలు కూడా ఈ పథకంలో చూపలేదని విమర్శించారు. ఈ నిర్ణయాల వల్ల కొత్త పరిశ్రమలు ఏర్పడటం కాకుండా పాత పరిశ్రమల స్థానంలో పెద్ద భవనాలు, కమర్షియల్ ప్రాజెక్టులు పెరిగే అవకాశం ఉందన్నారు. ఈ పాలసీ కొద్దిమంది కాంగ్రెస్ నేతలు, ప్రభావవంతమైన రియల్ ఎస్టేట్ గుంపులు, ముఖ్యమంత్రికి దగ్గరగా ఉన్న వ్యాపారవేత్తలు మరియు కుటుంబ సభ్యులకే లాభం చేకూర్చేలా రూపొందించబడింది. ఇది తెలంగాణ ప్రజల నమ్మకానికి చేసిన ద్రోహం" అని కేటీఆర్ తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా స్పందించి ఈ భారీ భూ కుంభకోణాన్ని ఆపండి. ఇప్పుడు కూడా మౌనం పాటిస్తే, మీకూ ఈ వ్యవహారంలో భాగస్వామ్యం ఉన్నట్టే ప్రజలు భావించాల్సి ఉంటుంది" అని కేటీఆర్ రాశారు. కాంగ్రెస్ అధిష్టానం అంగీకారం లేకుండా ఇంత పెద్ద భూమి దందా జరిగే అవకాశం లేదని, అందుకే రాహుల్ గాంధీ వెంటనే జోక్యం చేసుకోవాలని ఆయన అన్నారు.

## మరో 37 మంది మావోయిస్టుల లొంగుబాటు

### ::: మావోయిస్టు సంస్థకు మరో భారీ షాక్

దంతెవాడ: ఛత్తీస్‌గఢ్‌లోని మావోయిస్టు సంస్థకు మరో భారీ షాక్ తగిలింది. బస్తర్ డివిజన్‌లో ఉన్న దంతెవాడ జిల్లాలో ఆదివారం (నవంబర్ 30) మొత్తం 37 మంది మావోయిస్టులు అధికారుల ముందుకు వచ్చి శరణు కోరారు. వీరిలో 27 మంది వద్ద కలిపి రూ.65 లక్షల బహుమతి ఉంది. ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం చేపడుతున్న 'పూనా మర్గం' (మంచి దారికి మరలి) కార్యక్రమం ప్రభావంతో వీరు లొంగుబాటుకు ముందుకొచ్చారని పోలీసులు వెల్లడించారు. లొంగిన వారిలో 12 మంది మహిళా మావోయిస్టులు ఉండటం విశేషం. హింసను విడిచిపెట్టి సాధారణ జీవితంలో కలవాలని దంతెవాడ పోలీసులు ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. తాము ఇకపై హింసా మార్గం వద్దని, ప్రభుత్వ పునరావాస విధానంపై పూర్తి నమ్మకం ఉందని మావోయిస్టులు తెలిపారు. దంతెవాడలోని డీఆర్‌జీ కార్యాలయంలో ఉన్నతాధికారుల సమక్షంలో వారు అధికారికంగా లొంగిపోయారు. వారి వద్ద నుండి పెద్ద మొత్తంలో తుపాకులు, కార్ట్రిడ్జ్‌లు, పేలుడు ద్రవ్యాలు ఇతర సామగ్రిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. 2024-25లో జరిగిన ఆపరేషన్లు, ఎన్‌కౌంటర్లు, అలాగే రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న పునరావాస ప్రయోజనాలు మావోయిస్టులను హింస వదిలేలా ప్రోత్సహించాయని ఎస్పీ రాయ్ వివరించారు. గత 20 నెలల్లో దంతెవాడలో 508 మంది మావోయిస్టులు లొంగగా, వారిలో 165 మంది గతంలోనే అండర్‌గ్రౌండ్‌లో పనిచేసినవారని ఆయన తెలిపారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

# 11మంది దుర్మరణం

### శివగంగ జిల్లా తిరుపత్తూర్ సమీపంలో ఘటన

### కొందరి పరిస్థితి విషమంగా

### ఉండటంతో పెరగనున్న మృతుల సంఖ్య

### వారం రోజుల వ్యవధిలోనే ఇది రెండో పెద్ద బస్సు ప్రమాదం

తమిళనాడులో ఆదివారం సాయంత్రం ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. శివగంగ జిల్లాలోని తిరుపత్తూర్ సమీపంలో రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్నాయి. ఈ దుర్ఘటనలో ఒక చిన్నారితో సహా 11 మంది అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. 20 మంది తీవ్రంగా గాయపడ్డారు. ప్రస్తుతం సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, ఒక బస్సు తిరుప్పూర్ నుంచి కారైకుడి వస్తుండగా... మరో బస్సు కారైకుడి నుంచి దిండిగల్‌కు ప్రయాణిస్తోంది. తిరుపత్తూర్ వద్దకు రాగానే ఈ రెండు బస్సులు ఢీకొన్నాయి. ప్రమాదం జరిగిన వెంటనే స్థానికులు సహాయక చర్యలు చేపట్టి, క్షతగాత్రులను శివగంగ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గాయపడిన వారిలో కొందరి పరిస్థితి విషమంగా ఉండటంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమిళనాడులో వారం రోజుల వ్యవధిలోనే ఇలాంటి ఘోర ప్రమాదం జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. నవంబర్ 24న తెన్కాశి జిల్లాలో రెండు ప్రైవేట్ బస్సులు ఢీకొన్న ఘటనలో ఐదుగురు మహిళలు సహా ఆరుగురు మరణించగా, 56 మంది గాయపడ్డారు. ఆ ప్రమాదానికి డ్రైవర్ అతివేగమే కారణమని పోలీసులు నిర్ధారించారు. ఆ ఘటనలో మృతుల కుటుంబాలకు సీఎం ఎంకే స్టాలిన్ రూ. 3 లక్షల చొప్పున పరిహారం ప్రకటించారు.



# సోనియా-రాహుల్‌పై మరో ఎఫ్ఐఆర్

న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీని ఎన్నాళ్లుగానో వెంటాడుతున్న నేషనల్ హెరాల్డ్ వివాదంలో మరో ముఖ్యమైన మార్పు వెలుగుచూసింది. ఈ కేసులో ప్రధాన బాధ్యులుగా భావిస్తున్న పార్టీ సీనియర్ నాయకులు సోనియా గాంధీ, రాహుల్ గాంధీపై ఢిల్లీ పోలీసులు ఆదివారం కొత్త ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశారు. ఎన్‌ఫోర్స్మెంట్ డైరెక్టరేట్ ఇచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని ఈ చర్య తీసుకున్నట్లు తెలుస్తోంది. వారి వెంట ఈ కేసులో సహనిందితులుగా ఉన్న కాంగ్రెస్ నాయకులు సుమన్ దుబే, శామ్ పిట్రోడా, అలాగే యంగ్ ఇండియన్, అసోసియేటెడ్ జర్నల్స్, దాని ప్రమోటర్ సునీల్ భండారీ తదితరులపై కూడా ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయి. అదనంగా, మనీ లాండరింగ్ నిరోధక చట్టంలోని 66(2) అధికారం ఆధారంగా ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలని ఈడీ ముందడుగు వేసిందని విశ్వసనీయ వర్గాలు వెల్లడిస్తున్నాయి. తాజా కేసు నేపథ్యంలో కాంగ్రెస్, బీజేపీ మధ్య ఆరోపణలు తీవ్రరూపం దాల్చాయి. ఈ ఎఫ్ఐఆర్‌ను కారణంగా చూపించి సోనియా, రాహుల్‌లకు వేధింపులు పెంచడానికి ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా చవకబారు రాజకీయాలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు జైరాం రమేశ్, అభిషేక్ సింఘ్వీ, ప్రమోద్ తివారీ మండిపడ్డారు. ఇది వారి అసురక్షిత భావానికి నిదర్శనమని వారు వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ ఆరోపణలను బీజేపీ సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఖండిస్తూ పూర్తిగా తోసిపుచ్చారు.

# భారత క్రీడారంగానికి ఇది 'సూపర్ హిట్' నెల

## 'మన్‌కీబాత్'లో ప్రధాని మోదీ ప్రశంసల వర్షం



భారత క్రీడా రంగానికి గడిచిన నెల ఒక సూపర్ హిట్ నెలగా నిలిచిపోయిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభివర్ణించారు. తన నెలవారీ రేడియో కార్యక్రమం 'మన్ కీ బాత్' 128వ ఎపిసోడ్‌లో ఆయన మాట్లాడుతూ.. పలు అంతర్జాతీయ క్రీడా పోటీలలో భారత క్రీడాకారులు సాధించిన అద్భుత విజయాలను ప్రత్యేకంగా ప్రస్తావించారు. క్రికెట్ నుంచి కబడ్డీ, బాక్సింగ్ వరకు వివిధ రంగాల్లో మన అథ్లెట్లు దేశానికి గర్వకారణంగా నిలిచారని కొనియాడారు. ఈ సందర్భంగా ప్రధాని మాట్లాడుతూ, "భారత క్రీడా రంగం పరంగా ఈ నెల ఒక సూపర్ హిట్‌గా నిలిచింది. ఐసీసీ మహిళల ప్రపంచ కప్ గెలవడంతో ఈ నెల ప్రారంభమైంది. ఆ తర్వాత కూడా క్రీడా మైదానాల్లో మన వాళ్ల జోరు కొనసాగింది. కొద్ది రోజుల క్రితం టోక్యోలో జరిగిన డెఫ్లింపిక్స్‌లో భారత క్రీడాకారులు 20 పతకాలు సాధించి, ఇప్పటివరకు అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు" అని తెలిపారు. అంతేకాకుండా, భారత మహిళా కబడ్డీ జట్టు ప్రపంచ కప్‌ను కైవసం చేసుకోవడంపై ప్రధాని హర్షం వ్యక్తం చేశారు. టోర్నమెంట్ ఆరంభం నుంచి చివరి వరకు ఆధిపత్యం ప్రదర్శించిన మన అమ్మాయిలు, గ్రూప్ స్టేజ్‌లోని అన్ని మ్యాచ్‌లలో విజయం సాధించారు. సెమీ-ఫైనల్‌లో ఇరాన్‌పై 33-21 స్కోరుతో గెలిచి ఫైనల్‌కు దూసుకెళ్లారు. తుదిపోరులో చైనీస్ తైపీ జట్టును 35-28 తేడాతో ఓడించి విశ్వవిజేతగా నిలిచారు. "మన మహిళా క్రీడాకారులు కబడ్డీ ప్రపంచ కప్ గెలిచి చరిత్ర సృష్టించారు. టోర్నమెంట్ అంతటా వారి అద్భుతమైన ప్రదర్శన ప్రతి భారతీయుడి హృదయాన్ని గెలుచుకుంది" అని మోదీ పేర్కొన్నారు. ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ, గ్రేటర్ నోయిడాలో జరిగిన వరల్డ్ బాక్సింగ్ కప్ ఫైనల్స్‌లోనూ భారత బాక్సర్లు పతకాల పంట పండించారు. ఈ టోర్నమెంట్‌లో మన క్రీడాకారులు మొత్తం 20 పతకాలు సాధించారు. ఇందులో తొమ్మిది స్వర్ణాలు, ఆరు రజతాలు, ఐదు కాంస్య పతకాలు ఉన్నాయి. అయితే, ఈ విజయాలన్నింటిలోనూ అంధుల మహిళా క్రికెట్ జట్టు సాధించిన ప్రపంచ కప్ విజయం అత్యంత ప్రత్యేకమైనదని ప్రధాని మోదీ అభివర్ణించారు. టోర్నీలో ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా అజేయంగా నిలిచి కప్ గెలవడం వారి అసామాన్య ప్రతిభకు నిదర్శనమని అన్నారు. ఈ విజయం తర్వాత తాను జట్టు సభ్యులను తన నివాసంలో కలుసుకున్నానని ఆయన గుర్తుచేసుకున్నారు. "మిత్రులారా, వీటన్నింటికన్నా ఎక్కువగా మన మహిళల అంధుల క్రికెట్ జట్టు ప్రపంచ కప్ గెలవడంపై చర్చ జరుగుతోంది. విశేషమేమిటంటే, ఈ టోర్నమెంట్‌లో మన జట్టు ఒక్క మ్యాచ్ కూడా ఓడిపోకుండా గెలిచింది. ఈ జట్టులోని ప్రతి క్రీడాకారిణిని చూసి దేశ ప్రజలు గర్విస్తున్నారు. కేవలం రెండు రోజుల క్రితమే నేను ఈ జట్టును ప్రధానమంత్రి నివాసంలో కలిశాను. నిజంగా, ఈ జట్టు ధైర్యం, పట్టుదల మనకు ఎంతో నేర్పుతాయి. మన క్రీడా చరిత్రలోని గొప్ప విజయాలలో ఇదొకటి. ఇది ప్రతి భారతీయుడికి స్ఫూర్తినిస్తూనే ఉంటుంది" అని ప్రధాని మోదీ భావోద్వేగంగా ప్రసంగించారు. ఈ విజయాలు భారత క్రీడాకారుల అంకితభావానికి, కఠోర శ్రమకు నిదర్శనమని ఆయన కొనియాడారు.



## నామినేషన్ కేంద్రాలు,ఎస్ఎస్టీ చెక్ పోస్ట్ ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

### జిల్లెల ఎస్ ఎస్ టీ చెక్ పోస్ట్ తనిఖీబీ

వాయిస్ టుడే న్యూస్‌బీ రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 30 : రాజన్న సిరిసిల్ల జిల్లా లోని గ్రామ పంచాయతీ రెండో విడత ఎన్నికల నామినేషన్ కేంద్రాలు, చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ పరిశీలించారు. తంగళ్ళపల్లి మండలం జిల్లెల ఎస్ఎస్ టీ చెక్ పోస్ట్ ను ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తనిఖీ చేశారు. రిజిస్టర్లు పరిశీలించి, వాహనాల తనిఖీ వివరాలు అడిగి తెలుసుకున్నారు.జిల్లెల గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ కేంద్రం, తంగళ్ళపల్లి ఎంపీడీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్, తంగళ్ళపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఆర్ఓ కేంద్రాన్ని పరిశీలించారు. ఆర్ఓ కేంద్రాల్లో అభ్యర్థుల కోసం కల్పించిన సహాయ కేంద్రం, వసతులు పరిశీలించి, అధికారులకు సూచనలు చేశారు. ఈ పరిశీలనలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ జయంత్, ఎంపీడీఓ లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## వికలాంగులు,అనారోగ్యం తో బాధపడుతున్న ఉద్యోగ ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలి

### ::: టీ ఎస్ యు టీ ఎఫ్ రాజన్న సిరిసిల్ల.

వాయిస్ టుడే న్యూస్, రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 30 : రాజన్న సిరిసిల్ల జిల్లా లోని రెండవ సాధారణ పంచాయితీ ఎన్నికల లో వికలాంగులు,వితంతువులు,అనారోగ్యంతో బాధపడుతున్న ,ఉద్యోగ విరమణ పొందిన,ఉద్యోగ విరమణ కు దగ్గరలో ఉన్న ఉద్యోగ,ఉపాధ్యాయులకు ఎన్నికల విధుల నుండి మినహాయింపు ఇవ్వాలని %ఋఖుఖీ% జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు పర్కాల రవీందర్,జంగిటి రాజు లు జిల్లా పంచాయితీ అధికారి షర్ఫోద్దిన్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు.ఈ సందర్భంగా డిపిఓ అటువంటి వారిని పరిశీలించి తప్పకుండా మినహాయింపు ఇస్తామని హామీ ఇచ్చారని పేర్కొన్నారు.

# పేద విద్యార్థులకు సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆర్థిక చేయూత

వాయిస్ టుడే న్యూస్ రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 30 : రాజన్న సిరిసిల్ల జిల్లా లోని పేద కుటుంబానికి చెందిన చదువులో రాణించే విద్యార్థులకు ఎల్లప్పుడూ అండగా ఉంటాం అన్న సోషల్ వెల్ఫేర్ ఆర్గనైజేషన్ (SWA) సిరిసిల్ల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సిరిసిల్ల జిల్లాకు చెందిన ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న నిరుపేద కుటుంబాలకు చెందిన 8 మంది విద్యార్థులు పుట్ట రీచా, సిలివరి వికాస వర్ధన్ గుగ్గిల్ల అలేఖ్య, ఎర్రవెల్లి అక్షయ, ఈ .పూజశ్రీ, చీకట్ల అక్షయ, కన్నం చందు, జిల్ల వర్షిత విద్యార్థులకు ఒక్కొక్కరికి 5వేల రూపాయల చొప్పున అందించడం జరిగింది.ఈ సందర్భంగా అధ్యక్షులు మోతె దేవి రెడ్డి గారు మాట్లాడుతూ సామాజిక దృక్పథం కలిగిన మిత్రులతో ఏర్పాటుచేసిన ఈ సంస్థ %ంఋ% అన్నివేళలా ఎల్లప్పుడూ ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులకు అండగా ఉంటుందని భవిష్యత్తులో ఉన్నత స్థాయికి చేరుకోవడంలో ఈ సంస్థ తోడ్పాటు అందిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్ అధికారిగా బాధ్యతలు స్వీకరించిన దబ్బెడ హనుమాన్లు, పదవీ విరమణ చెందిన మారం స్వదేశ్ కుమార్,రవీందర్ రెడ్డి కి సన్మాన కార్యక్రమం చేయడం జరిగింది. ఇందులో ఉపాధ్యక్షులు పంజాల వెంకటేశ్వర్లు, వడ్లకొండ చంద్రం పాతూరు మహేందర్ రెడ్డి , మధుకర్ రావు,దుమాల రమానాద్ రెడ్డి ,గోవర్ధన్ , రాజలింగారెడ్డి ,మదుసూదన్ రెడ్డి ,రాజశేఖర్ రెడ్డి ,బాల్రెడ్డి, మైలారం తిరుపతి, బుస రాజేందర్ ,గోవర్ధన్ రెడ్డి సిద్ధంశెట్టి శ్రీనివాస్ ,సకినాల భాస్కర్ ,హనుమాన్లు ,తిరుపతి, శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస్ ,శేఖర్ రెడ్డి ,ఆనంద్ రెడ్డి , రవీందర్ రెడ్డి కదిరె శ్రీనివాస్ , విక్కుర్తి అంజయ్య, హన్మంత రెడ్డి, కిషన్ రావు, శనగరం శ్రీనివాస్, పాల్గొన్నారు.




# నిక్కచ్చిగా ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు

### సర్పంచ్ ఎన్నికలలో ప్రలోభాలకు గురి చేస్తే కేసులు తప్పవు

### స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు హక్కును వినియోగించుకోవాలి : సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి.

వాయిస్ టుడే న్యూస్‌బీ రాజన్న సిరిసిల్ల జిల్లాబీ నవంబర్ 30 : రాజన్న సిరిసిల్ల జిల్లా లో సర్పంచ్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి (మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్) ను కఠినంగా అమలు చేయడంతో పాటు,ప్రలోభాలను నివారించేందుకు జిల్లా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టడం జరిగిందని సిరిసిల్ల డిఎస్పీ నాగేంద్రచారి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా డిఎస్పీ మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల సమయంలో గ్రామాల్లో అభ్యర్థులు,వారి అనుచరులు డబ్బు పంచడం,ఓటర్లను ప్రలోభాలకు గురిచేయడం,కుల సంఘాలకు డబ్బు పంచడం, గ్రామ అభివృద్ధి పేరుతో డబ్బులు అడగడం, ఆశాచూపడం వంటి చర్యలపై ఎన్నికల ప్రవర్తన నియమావళి ప్రకారం కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. ప్రజలు భయభ్రాంతులు లేకుండా, స్వేచ్ఛాయుతంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా జిల్లా పోలీసు యంత్రాంగం అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు.ఎన్నికల ప్రక్రియ పారదర్శకంగా,శాంతియుత వాతావరణంలో జరిగేలా జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్ట్ లు, మండలాల వారిగా %ఖీూ% బృందాలు ఏర్పాటు చేసి నిరంతరం ఎన్నికలపై పర్యవేక్షణ చేయడం జరుగుతుందని డిఎస్పీ తెలిపారు..



### కాచిగూడ ఎస్సీ హాస్టల్‌ను

## వెంటనే తెరిపించండి

### కేంద్రమంత్రి కిషన్ రెడ్డిని కలిసి విజ్ఞప్తి చేసిన హాస్టల్ పూర్వ విధ్యార్థులు



హైదరాబాద్ నవంబర్ 30: కాచిగూడ లోని సోషల్ వెల్ఫేర్ కాలేజ్ బాయ్స్ హాస్టల్ ను తెరిపించే విధంగా తగు చర్యలు తీసుకోవాలని హాస్టల్ ఓల్డ్ స్టూడెంట్స్ కమిటీ ప్రతినిధి బృందం ఆదివారం కేంద్రమంత్రి జి.కిషన్ రెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాచిగూడలో హాస్టల్ పూర్వ విద్యార్థుల కమిటీ ముఖ్య సలహాదారులు బొమ్మెర రాం మూర్తి, రుద్రవరం లింగస్వామి, అధ్యక్షుడు బోయిని శ్రీనివాస్, ప్రధానకార్యదర్శి రుద్రవరం సునిల్, దొమ్మాల మల్లేష్, కాటపాక బాబు మాట్లాడుతూ కరోనా సమయంలో గత ఐదు సంవత్సరాల క్రితం హాస్టల్ ను మూసివేయడం జరిగిందని, కరోనా అనంతరం అన్ని హాస్టల్స్ ను ప్రభుత్వం తెరిచి నగరంలోని ఒకే ఒక్క ఎస్సీ హాస్టల్ ను తెరవకుండా పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరించిందని ఆరోపించారు. 1975లో స్టూడెంట్ మేనేజ్ మెంట్ తో స్థాపించబడిన ఈ ఎస్సీ హాస్టల్లో వేలాది మంది చదువుకుని ఉన్నత ఉద్యోగాల్లో స్థిరపడి పోయారని తెలిపారు. అధిక సంఖ్యలో ప్రజా ప్రతినిధులుగా, రాజకీయ నాయకులుగా, మంత్రులుగా, ఐఏఎస్, ఐపీఎస్ లుగా ప్రస్తుతం కొనసాగుతున్నారని తెలిపారు. హాస్టల్ ను నిరంతరం మూసివేయడం వల్ల వేలాది మంది పేద ఎస్సీ విద్యార్థులు విద్యను అభ్యసించలేకపోతున్నారని, వారి ఉజ్వల భవిష్యత్ ప్రమాదంలోకి నెట్టివేయబడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి హాస్టల్ ను 15 రోజుల్లో తెరిపించాలని, లేని యెడల హాస్టల్ తెరిచే వరకు విద్యార్థి ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తామని వారు హెచ్చరించారు. ఇప్పటికే సంబంధిత ఉన్నతాధికారులు, ప్రజా ప్రతినిధులు, మంత్రులను కలిసి హాస్టల్ ను తెరిపించాలని విజ్ఞప్తి చేయడం జరిగిందని తెలిపారు.



### ఎన్నికల నామినేషన్, స్క్రూటినీ ప్రక్రియలను పరిశీలించిన

## ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ లావణ్య

భద్రాద్రి కొత్తగూడెం వాయిస్ టుడే నవంబర్ 30 : జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ స్క్రూటినీ ప్రక్రియల పారదర్శక నిర్వహణను సమీక్షించేందుకు ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్ అబ్జర్వర్ లావణ్య ఆదివారం పలుమండలాల్లో పర్యటించారు. చంద్రుగొండ మండల పరిధిలోని రావికంపాడు, చంద్రుగొండ, దామరాచర్ల, గానుగపాడు గ్రామపంచాయతీలతో పాటు చూంచుపల్లి మండలం పరిధిలోని విద్యానగర్ కాలనీ, 3 క్లైన్, 4 క్లైన్ గ్రామపంచాయతీలలో నామినేషన్ స్వీకరణ ప్రక్రియను ఆమె ప్రత్యక్షంగా పరిశీలించారు. అభ్యర్థుల నామినేషన్ల ఉపసంహరణ, ధృవీకరణ, దస్త్రాల పరిశీలన వంటి కార్యక్రమాలు ఎన్నికల మార్గదర్శకాలకు అనుగుణంగా జరుగుతున్నాయా అనే అంశాలను ఆమె అధికారులు ద్వారా వివరంగా తెలుసుకున్నారు. అనంతరం, భూర్గంపహాడ్ మండలం పరిధిలోని మొరంపల్లి బంజార, భూర్గంపహాడ్, నాగినేని ప్రోలు గ్రామపంచాయతీలలో నిర్వహించిన స్క్రూటినీ ప్రక్రియను కూడా పరిశీలించి, ఎన్నికల సంబంధిత నిబంధనలు, షెడ్యూల్ ప్రకారం విధులు ఖచ్చితంగా అమలు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీడీఓలు, ఎంపీవోలు, ఎన్నికల బృంద సభ్యులు పాల్గొన్నారు.

## సమస్యలు ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయండి! : సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్




సుల్తానాబాద్, పెద్దపెల్లి జిల్లా నవంబర్–30 వాయిస్ టుడే: ప్రజలు సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని, శాంతి భద్రతల పరిరక్షణే పోలీసుల ధ్యేయమని సుల్తానాబాద్ ఎస్సై చంద్రకుమార్ తెలియజేశారు. ఆదివారం ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన మాట్లాడుతూ, సుల్తానాబాద్ మండలం ప్రజలతో మమేకమై ముందుకు సాగుతామన్నారు. ప్రజలు సమస్యలు ఉంటే నేరుగా పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయాలని, వారి సమస్యల పరిష్కారానికి ఇరవై నాలుగు గంటల పాటు పనిచేస్తామన్నారు. మహిళల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తే అత్యంత కఠినంగా వ్యవహరిస్తామని, ర్యాగింగ్, ఈవ్ టీజింగ్ కు పాల్పడితే జైలు శిక్ష తప్పదన్నారు. విజిబుల్ పోలింగ్ అమలు చేస్తామని, ఫ్రెండ్లీ పోలీసింగ్ అమలు చేయడంతో పాటు చట్ట వ్యతిరేక కార్యకలపాలకు పాల్పడే వారి పట్ల అత్యంత కఠినంగా వ్యవహరిస్తామన్నారు. నూతన ఎస్ఐ కి సిబ్బంది తో పాటు పలువురు, పుష్ప గుచ్చాలు, మొక్కలు అందించి శుభాకాంక్షలు తెలియజేశారు..

## ఘనంగా మంత్రి వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు



రామకృష్ణాపూర్ నవంబర్ 30 (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి జన్మదిన వేడుకలు రామకృష్ణాపూర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు, కార్యకర్తలు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నూతన డిసిసి ప్రెసిడెంట్ రఘునాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ మంత్రి వివేక్ వెంకటస్వామి జిల్లా డిసిసి అధ్యక్షునిగా నియమించినందుకు కృతజ్ఞతలు తెలియజేస్తూ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు. రాబోయే గ్రామ పంచాయతీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలిపించడానికి కార్యకర్తలు కృషి చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, నాయకులు గోపతి రాజయ్య ,జిల్లా అధికార ప్రతినిధి వోడ్నాల శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్,గాండ్ల సమ్మయ్య, తదితరులు పాల్గొన్నారు.



## ఎల్వత్ గ్రామంలో కర్రలతో రాళ్ల దాడిలో తీవ్ర గాయాల పాలైన గంగారాం

నిర్మల్ జిల్లా ప్రతినిధి (వాయిస్ టుడే) నవంబర్ 30 : నిర్మల్ జిల్లా తానుర మండలం ఎల్వత్ గ్రామంలో ఒకే కులానికి చెందిన ఇరువు వర్గాల మధ్య భేదాలు ఒక వర్గం లోని అమ్మాయి ఇంక వర్గం అబ్బాయి ఇద్దరు ఒకరిని ఒకరు ఇష్టపడి వెళ్లిపోవడం వలన ఇద్దరి మధ్య ద్వేషం ఏర్పడి అమ్మాయి వాళ్ళ వర్గం అబ్బాయి వర్గ కుటుంబం పై కర్రలతో రాళ్లతో దాడి చేసి తీవ్రంగా గాయపరచడం జరిగింది మరియు రెండు వాహనాలను ధ్వసం చేసినట్టు వారు వివరించారు. ఇలా దాడి చేయడం ఇది మూడవసారి అది తెలిపారు ఒక నెల ముందు దాడి చేసినప్పుడు తాండూర్ మండలం పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని నిందితులకు స్వేచ్ఛనిచ్చినందుకు నిందితులు మరోసారి తేదీ 25 నవంబర్ 2025 రోజున దాడి చేసి కుటుంబంలోని గంగారాం పిరాజి వాగమారే వయసు 65 సంవత్సరములు అనే వ్యక్తిని కుర్రాళ్లతో రాళ్లతో కాళ్లు చేతులతో కొట్టి తీవ్రంగా గాయపరచడం వలన రక్తస్రావం కావడంతో బైంసా ప్రభుత్వ ఆసుపత్రి చేర్చి ప్రస్తుతం చికిత్స (వైద్యం) పొందుచున్నాడు అలాగే కుటుంబంలోని వ్యక్తుల ను తీవ్రంగా గాయపడ్డారు

## గాంధారి వనంలో కార్తీక వనభోజనాలు



రామకృష్ణాపూర్ నవంబర్ 30 (వాయిస్ టుడే) : మంచిర్యాల జిల్లా గోవింద పతి శ్రీవారి సేవ సమితి ఆధ్వర్యంలో ఆదివారం గాంధారి వనంలో కార్తీక వనభోజన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథులుగా గోవింద పతి శ్రీవారి సేవా సమితి వ్యవస్థాపకులు, చైర్మన్ శ్రీనివాస్,అధ్యక్షులు భాగ్యలక్ష్మి ,కమిటీ మెంబర్ శైలజ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ జిల్లా గోవింద పతి శ్రీవారి సేవ సభ్యులు మంచిర్యాలలో ఉన్నటువంటి దేవాలయాలు అలాగే తిరుమల తిరుపతి, వేములవాడ, కొండగట్టు, శ్రీశైలం వంటి ఆలయాల్లో సేవా కార్యక్రమాల్లో పాల్గొనడం అభినందించ దగిన విషయమని అన్నారు. ఇలాగే దేవాలయాల్లో మున్ముందు చేపట్టే సేవా కార్యక్రమాల్లో పాల్గొంటూ దేవునికి సేవ చేయాలని తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళలకు ,పిల్లలకు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. మంచిర్యాల జిల్లా గోవిందాపతి సేవా అధ్యక్షులు విజయ్ కుమార్ ,సెక్రటరీ ,సంపత్, రాజేందర్, గోలి కుమార్, సత్యప్రసాద్ ,ప్రభాకర్ ,శ్రీనివాస్ గౌడ్ ,నరేష్ పాల్గొన్నారు.

## వినియోగదారుల జాతీయ సమాఖ్య సభ్యుల సమక్షంలో

# యాత్ర ఐక్యత బ్యానర్ విడుదల

వరంగల్ (వాయిస్‌టుడే) నవంబర్ 30 : వరంగల్ శివనగర్ లోని రాష్ట్ర వినియోగదారుల సమాఖ్య కార్యాలయం లో జాతీయ వినియోగదారుల సమాఖ్య సీ.సీ.ఐ ఫౌండర్ చైర్మన్ ,” కన్స్యూమర్ మ్యాన్ ఆఫ్ ఇండియా” గా ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన డా .అనంత శర్మ “భారత్ యాత్ర” పేరిట దేశ వినియోగదారుల సమస్యలపై జరిపే “యాత్ర ఐక్యతా బ్యానర్” ను రూపొందించారు. అట్టి బ్యానర్ ను దక్షిణాది రాష్ట్రాల సమాఖ్య సెక్రటరీ జనరల్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మొగిలిచెర్ల సుదర్శన్ ఆధ్వర్యం లో జాతీయ సమాఖ్య సభ్యుల సమక్షంలో ఆదివారం విడుదల చేశారు. వినియోగదారులను జాగృత పరిచి సి. పి యాక్ట్ 1986, మరియు 2019 ల నేపథ్యాన్ని , వాటి అవసరాలను తద్వారా వినియోగదారులు పొందే రక్షణ మరియు లాభాలు నేటికి గ్రామీణ స్థాయిలో అవగాహన పూర్తిగా లేకపోవడం , తద్వారా మితిమీరిన ఆహార కల్తీ, నకిలీ ఔషధాలు, ఆన్లైన్ మోసాలు, అధిక ధరలు, అనుచిత వ్యాపార ధోరణి, విద్యా వ్యాపారం, ఉన్నత విద్యలో విపరీత ధోరణులు, ప్రైవేటీకరణ ఇబ్బందులు మరియు ఆర్థిక మోసాలు లాంటి అనేక కారణాలతో అనునిత్యం ఇబ్బందులు పడడం ,చట్టాల అమలు పై వివిధ రాష్ట్రాల ప్రభుత్వాలు సరిగా పట్టించుకోకపోవడం ,తదితర అంశాలను వెలికి తీసి భారత వినియోగదారులను చైతన్య పరచడమేకాక స్థానిక ప్రభుత్వాలు చట్టాల అమలుపై శ్రద్ధ వహించ దానికి విజ్ఞాపనలతో కూడిన “భారత యాత్ర” జాతీయ వినియోగదారుల దినోత్సవం డిసెంబర్ 24 న ఢిల్లీలో కేంద్ర వినియోగదారుల వ్యవహారాల మంత్రిత్వ శాఖ సమక్షం లో ప్రారంభమై కాశ్మీర్ నుండి కన్యాకుమారి మరియు లక్ష్యదీప్ నుండి అండమాన్ దీవుల కు సైతం చేరు ఈ యాత్ర తిరిగి అంతర్జాతీయ వినియోగదారుల దినోత్సవం 15 మార్చి 2026 న తిరిగి ఢిల్లీలో ముగుస్తుందనీ వివరించారు. అనంతరం ఇలాంటి అఖండ మైన లక్ష్యంగా సాగే ఈ యాత్ర లో దక్షిణాది రాష్ట్రాల సమాఖ్య ప్రతినిధులు పాల్గొనడమే కాకుండా, నేటి నుండి అన్ని రాష్ట్రాల్లోని జిల్లాలు మండలాలు మరియు



గ్రామస్థాయి వరకు ఈ యాత్ర ఉద్దేశ్యం మరియు లక్ష్యాన్ని వివరిస్తూ కార్యక్రమాలు చేపట్టాలని సమావేశం నిర్ణయించింది, దక్షిణాది రాష్ట్రాల్లో ముందుగా గోవా రాష్ట్రం లో ప్రవేశించే ఈ యాత్ర ను దక్షిణ రాష్ట్రాల సమాఖ్య జనవరి 9, 2026 న స్వాగతం పలికి పాల్గొనాలని నిర్ణయించింది. ఈ కార్యక్రమం సీ. సీ. ఐ. రాష్ట్ర ఉపాధ్యక్షులు యం.యశ్వంత్ కుమార్ అధ్యక్షత వహించగా సౌత్ ఫార్మసీ అడ్వైసర్ టీ. ఎల్ .ఎన్.స్వామి, రాష్ట్ర కమిటీ బాధ్యులు బూర్గుల శ్రవణ్ కుమార్, రావుల రంజిత్ కుమార్, మురహరి కార్తీక్, ఏ. ఐ సీ.డబ్ల్యూ. సీ రాష్ట్ర అధ్యక్షులు ప్రవీణ్ కుమార్, న్యాయకమీటి సభ్యులు రంగరాజు ఆనంద రావు,బండి అనిల్ కుమార్, బాలాజీ.కుమార్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# డిసెంబర్ 3న జర్నలిస్టుల సమస్యలపై మహాధర్నా

### టీయుడబ్ల్యూజె (ఐజెయు) ఆధ్వర్యంలో కరపత్రాల ఆవిష్కరణ

హనుమకొండ జిల్లా, వాయిస్ టుడే: జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీయుడబ్ల్యూజే (ఐజెయు) ఆధ్వర్యంలో హైదరాబాద్ లో డిసెంబర్ 3న మహా ధర్నా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు టీయుడబ్ల్యూజె (ఐజేయూ) జిల్లా అధ్యక్ష,ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి,తోట సుధాకర్ తెలిపారు. ఆదివారం హనుమకొండ బాల సముద్రంలోని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో టీయూడబ్ల్యూజ్జే హనుమకొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో డిసెంబర్ 3న హైదరాబాద్ లో నిర్వహించతలపెట్టిన మహా ధర్నా కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జర్నలిస్టులకు తక్షణమే అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని,ఆరోగ్య భీమా పథకాన్ని పునరుద్ధరించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని, వృత్తి కమిటీ వెంటనే ఏర్పాటు చేయాలని జర్నలిస్టులు పెద్దపెట్టున నినాదాలు చేశారు.అనంతరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గడ్డం రాజిరెడ్డి,తోట సుధాకర్ మాట్లాడుతూ గత రెండు సంవత్సరాలుగా జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం తాత్సార దోరణి అవలంబిస్తూ కాలయాపన చేస్తున్నదని అన్నారు. జర్నలిస్టుల సమస్యలపై పలుమార్లు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా నిర్లక్ష్యం వహిస్తున్నదని.. ఈ క్రమంలో ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చేందుకు వడిసెంబర్ 3న హైదారాబాద్ మాసాబ్ ట్యాంక్ రాష్ట్ర సమాచార కమీషనర్ కార్యాలయం వద్ద ఉదయం 10 గంటలకు మహా ధర్నా నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. ఈ ధర్నా కార్యక్రమానికి జాతీయ,రాష్ట్ర,జిల్లా,మండల కమిటీల నాయకులు,యూనియన్ సభ్యులు పెద్ద సంఖ్యలో



తరలివచ్చి విజయవంతం చేయాలని వారు కోరారు.ఈ కార్యక్రమంలో టీయుడబ్ల్యూజె (ఐజేయూ) రాష్ట్ర ఉపాధ్యక్షులు గాడిపెల్లి మధు,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కంకనాల సంతోష్,జాతీయ కౌన్సిల్ సభ్యులు పీవీ మదన్ మోహన్,ప్రెస్ క్లబ్ మాజీ అధ్యక్షులు గడ్డం కేశవ మూర్తి,గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య,సహాయ కార్యదర్శి డాక్టర్ పొడిశెట్టి విష్ణు వర్ధన్,సీనియర్ నాయకులు సి.హెచ్ సోమనర్సయ్య,ఎం.రాజేంద్రప్రసాద్,అనుముల రవి,దేవేందర్,ఎండి ఉస్మాన్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# వల్లంపట్ల సాహిత్యం - సామాజిక చైతన్యం.. గ్రంధావిష్కరణ

### కార్యక్రమంలో పాల్గొన్న

### రాష్ట్ర గ్రంథాలయ కార్పొరేషన్ చైర్మన్ యం డి రియాజ్



హన్మకొండ ( వాయిస్ టుడే ) నవంబర్ 30 : హనుమకొండ నయీంనగర్ వాగ్దేవి కళాశాల సెమినార్ హాల్‌లో ఆదివారం కాకతీయ యూనివర్సిటీ జాతీయ సదస్సు పత్రాలు ”వల్లంపట్ల సాహిత్యం - సామాజిక చైతన్యం” అను గ్రంథావిష్కరణ ఘనంగా జరిగింది. ఈ సభకు తెలంగాణ రాష్ట్ర గ్రంథాలయ కార్పోరేషన్ చైర్మన్ డా. రియాజ్ ముఖ్య అతిథిగా హాజరై ఈ గ్రంథాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ సమాజ ప్రగతికి మూలమైన భాషా సాహిత్య అభివృద్ధి కోసం జ్ఞాన నిలయాలైన గ్రంథాలయాల అభివృద్ధి కోసం ప్రభుత్వం కృత నిశ్చయంతో వుందని అందుకోసం కావాల్సిన ప్రణాళికలను రూపొందించి దశల వారిగ అమలు చేస్తామని తెలియజేశారు. తెలుగు ప్రజలు ఉత్తమ పాఠకులుగా ఎదిగి గ్రంథాలయాల సేవలను ముందుకు తీసుకెళ్ళాలని కోరారు. సమాజ చైతన్యం కోసం ఉత్తమ సాహిత్యాన్ని అనేక ప్రక్రియలలో రచనలు చేసి ప్రజల్లోకి తీసుకెళ్ళి మార్పుకోసం అవిరళ కృషి చేస్తున్న ప్రజా కళాకారులు, సాహితీకారులైన డా౹౹ వల్లంపట్ల నాగశ్వర్ రావు కృషి మహోన్నతమైందని అయన కొనియాడారు. కొత్తతరం వారు అయన స్పూర్తితో ముందుకు రావాలని పిలుపునిచ్చారు. హేతువాద శాస్త్రీయ దృక్పథాన్ని అభివృద్ధి పరచాలనే వారి రచనల ఆశయాన్ని ముందుకు తీసుకెళ్దామని తెలియజేశారు. సభా ప్రారంభకులుగా పాల్గొన్న ప్రముఖ నవలా రచయిత, కేంద్రసాహిత్య అకాడమీ అవార్డు గ్రహీత డా. అంపశయ్య నవీన్ మాట్లాడుతూ అమెరికాకు చెందిన నోబుల్ బహుమతి గ్రహీత బాబ్ దిలాన్ లాగానే ప్రజా వాగ్గేయకారుడు వల్లంపట్ల కూడా జీవిత కాలమంత కృషి చేస్తున్నాడని కొనియాడారు. సభాధ్యక్షులు ప్రొఫెసర్ బన్న అయిలయ్య మాట్లాడుతూ కాకతీయ యూనివర్సిటీ తెలుగు శాఖ ఆధ్యర్యంలో 2024లో ”వల్లంపట్ల నాగేశ్వర్ రావు సాహిత్యంపై రెండు రోజుల జాతీయ సదస్సు నిర్వహించామని అందులో 24 మంది పత్రాలు సమర్పించగా తన సంపాదకత్వంలో పుస్తకంగా ముద్రించి సాహితీ పరులకు అందుబాటులోకి తెచ్చామన్నారు. డా తాళ్ళపల్లి యాకమ్మ గ్రంథ సమీక్ష చేశారు. నాగవెల్లి జితేందర్ సామ్రాట్ అతిథులను వేదికమీదకు ఆహ్వానించారు. అతిథులుగా పర్యావరణ వేత్త రతన్ సింగ్ ఠాకూర్, ప్రముఖ కవి వి.ఆర్.విద్యార్థి, గంట రామిరెడ్డి, ప్రొఫెసర్ పొడిశెట్టి కృష్ణమాచారి, డా.పొన్నాల ఉపేందర్ పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కళాకారులు నల్లమారి రమేష్, చిలువేరు శ్రీనివాస్, మ్యాకల సూరయ్య, నక్క కుమారస్వామి, మేడి సురేష్, గాదె సమ్మయ్య, బ్రహ్మాచారి, రాజ శేఖర్, అరుణకీర్తి పతాక తమ గానంతో అలరించారు.

# తెలంగాణ బిడ్డల ప్రాణాలను బలి తీసుకున్న కాంగ్రెస్

### అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది..

### తెలంగాణ సమాజం రుణపడి ఉంటుంది..

### ప్రభుత్వ మాజీ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్




హనుమకొండ, వాయిస్ టుడే: తెలంగాణ బిడ్డల ప్రాణాలను బలి తీసుకున్న పార్టీ కాంగ్రెస్ పార్టీ అని. కేసీఆర్ చచ్చుడో-తెలంగాణ వచ్చుడో అనే నినాదంతో చావు నోట్లో తలపెట్టి స్వరాష్ట్రాన్ని కేసీఆర్ సాధించారని.. తెలంగాణ కోసం 14 ఏండ్ల సుదీర్ఘ పోరాటం చేసిన నాయకుడిపై దురద జల్లే ప్రయత్నం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులకు ప్రజలే గుణపాఠం చెబుతారని మాజీ ఛీఫ్ విప్,హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు దాస్యం వినయ్ భాస్కర్ అన్నారు. కేసీఆర్ దీక్షా దివస్ సందర్భంగా తెలంగాణ అమర వీరులకు నివాళు లర్పిస్తూ... ఆదివారం హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహం వద్ద నుంచి అదాలత్ వద్ద ఉన్న అమరవీరుల స్థూపం వరకు కొవ్వొత్తుల ర్యాలీ తీశారు. అనంతరం అమరవీరుల స్థూపానికి పూలమాల వేసి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా దాస్యం వినయ్ భాస్కర్ మాట్లాడుతూ కేసీఆర్ ఆమరణ నిరాహార దీక్షను తక్కువ చేసే కుట్రను కాంగ్రెస్ చేస్తోందని అన్నారు. అమరుల బలిదానాలకు కారణం కాంగ్రెస్ పార్టీ, తెలంగాణ ద్రోహి కాంగ్రెస్ పార్టీ అని మండిపడ్డారు. అమరవీరుల త్యాగం వెలకట్టలేనిది.. తెలంగాణ సమాజం రుణపడి ఉంటుందని అన్నారు. 60 ఏండ్ల గోస, వెనకబాటుకు కారణం కాంగ్రెస్ పార్టీ అని.. 10 ఏండ్ల బీఆర్ఎస్, కేసీఆర్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో అగ్రభాగన నిలిచిందన్నారు. 420 హామీలు,6 గ్యారెంటీల పేరుతో తెలంగాణ ప్రజలను మోసం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని ఎద్దేవాచేశారు. రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో తెలంగాణలోని అన్ని వర్గాలకు అన్యాయం జరుగుతోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ కుడా చైర్మన్ లు మర్రి యాదవరెడ్డి,చింతం సదానందం,కార్పొరేటర్ సంకు నర్సింగ రావు,మాజీ కార్పొరేటర్లు కుసుమ లక్ష్మీ నారాయణ,నాయకులు తాళ్లపెల్లి జనార్ధన్ గౌడ్,పులి రజినీకాంత్, నయీముద్దీన్, సదాంత్, ఖలీల్,కోటేశ్వర్ రావు,రాజు,ఎస్.కే మహమూద్,రామ్మూర్తి,రాకేష్ యాదవ్, ప్రశాంత్, వినయ్, సంజీవ్, వినీల్ రావు,శ్రీకాంత్ చారి, నరేంద్ర, సృజన్, సందీప్ యాదవ్, శేఖర్, సారిక, దేవమ్మ, పూర్ణిమ తదితరులు పాల్గొన్నారు.



## డిసెంబర్ 3న విద్యా వికాస్ ఉపకార వేతనాలు

వరంగల్ (వాయిస్‌టుడే) నవంబర్ 30 : భారత్ వికాస్ పరిషత్(బి వి పి) ఓరుగల్లు శాఖ ఆధ్వర్యంలో డిసెంబర్ 3న సింగిల్ పేరెంట్ పిల్లలకు ఉపకారవేతనాలు అందజేస్తున్నట్లు ఆ శాఖ అధ్యక్షులు డా. సుధీర్ కుమార్ అన్నారు. ఆదివారం హంటర్ రోడ్, నంది హిల్స్ కాలనీలోని బి వి పి కార్యాలయం లో బి వి పి జిల్లా కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్బంగా అయన మాట్లాడుతూ, భారత్ వికాస్ పరిషత్ చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ వారి సౌజన్యంతో, విద్యా వికాస్ స్కాలర్షిప్ 2025 పేరిట ఒక్కొకరికి రూ ఐదు వేల రూపాయలు చొప్పున 15 మంది (తండ్రి లేని ) విద్యార్థులకు నగదు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. బుధవారం రోజు హనుమకొండలోని ప్రభుత్వ ప్రాక్టీ సింగ్ హైస్కూల్ లో జరిగే కార్యక్రమనికి విద్యార్థులు తమ పేరెంట్స్ తో హాజరు కావాల్సిందిగా కోరారు. తొలుత, బి వి పి కార్యదర్శి బి సత్యనారాయణ గత ఆరు నెలలుగా నిర్వహించిన కార్యక్రమాలను వివరించారు. ఇంకా ఈ కార్యక్రమంలో ఫైనాన్స్ కార్యదర్శి బి వెంకట్ రెడ్డి, బి వి పి బాధ్యులు ఏం. సంతోష్ రెడ్డి, జైపాల్ రెడ్డి, బి.యన్.రెడ్డి, విసీ రామారావు, వివేకానంద ప్రసాద్, ఎం దామోదర్, రత్న మంజుల, స్నిగ్ధ, ప్రొఫెసర్ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు



## పంచాయతీ ఎన్నికలకు నామినేషన్ల జోరు

దంతాలపల్లి నవంబర్30(వాయిస్ టుడే) :-మండల వ్యాప్తంగా రెండో విడత స్థానిక ఎన్నికలకు గాను నామినేషన్ల పర్వం మొదటి రోజు ఆదివారం కొనసాగింది. సర్పంచిగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ను దాఖలు చేశారు. మండలంలోని 18 గ్రామపంచాయతీలో గాను 6 గ్రామాలలో 10 సర్పంచ్ అభ్యర్థుల నామినేషన్లు దాఖలు చేశారని ఎంపీడీవో పర్మి విజయ తెలిపారు. నామినేషన్ కేంద్రాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు . నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థితో పాటు మరో ఇద్దరు ప్రతిపాదించే , బలపరిచే వ్యక్తులకు మాత్రమే సెంటర్లకు అనుమతిచ్చారు . గ్రామాల వారిగా సర్పంచ్ నామినేషన్లు రామానుజపురం 05, గున్నపల్లి 01, బొడ్లాడ 01, బీరి శెట్టి గూడెం 01, నిదానపురం 01 సర్పంచ్ , 01 వార్డు మెంబెర్ , దంతాలపల్లి 01 సర్పంచ్ స్థానాలకు అభ్యర్థులు నామినేషన్ వేశారు . ఆదివారం మంచి రోజు కావడంతో హడావుడిగా సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు సిద్ధమయ్యారు. ఈ క్రమంలో సర్పంచ్ స్థానానికి పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల కోసం నూతనంగా తీసే బ్యాంక్ ఖాతా జిరాక్స్ సమర్పించాలని అధికారులు సూచించడం, కుల నివాస పత్రాల సమర్పించాలని అధికారుల ఆదేశాలతో బరిలో నిలబడే అభ్యర్థులంతా సరైన సమయంలో పత్రాలు అందక హైరాన పడ్డారు .సాంకేతిక కారణాలతో బ్యాంక్ ఖాతాలు తెరవక అంధకా ఏ ఏ పత్రాలు అభ్యర్థులు సమర్పించాలో అవగాహన లేక సంబంధిత అధికారులకు అర్థం కాక అభ్యర్థిలకు గందరగోళం నెలకొంది .దీంతో కొంతమంది అభ్యర్థులు సరైన పత్రాలు సమర్పించక నామినేషన్ వేయలేని పరిస్థితి తొలి రోజు నెలకొంది.



## బీసీ అభ్యర్థులనే ఎన్నుకొని బీసీల సత్తా చాటాలి

తొర్రూరు, నవంబర్ 30 వాయిస్ టుడే : రాష్ట్రంలో ఇప్పుడు జరుగబోయే గ్రామ సర్పంచ్ మరియు వార్డు మెంబర్ ఎలక్షన్లలో బీసీ రిజర్వేషన్ స్థానంలో కానీ, జనరల్ రిజర్వేషన్ స్థానంలో కానీ పోటీ చేస్తున్న ప్రతీ చోట బీసీ కులాలకు చెందిన అభ్యర్థులనే అత్యధిక ఓట్ల మెజారిటీతో ఎన్నుకొని, బీసీ కులాల సత్తాను చాటాలని బీసీ నాయకుడు, సామాజికవేత్త దొనికెన కుమారస్వామి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. తొర్రూరు డివిజన్ కేంద్రంలోని గెస్ట్ హౌస్ లో ఆదివారం నాడు బీసీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు దశాబ్దాల తరబడి ఎన్నో రంగాల్లో ప్రాతినిధ్యం లేక అధికారాలకు దూరమై వెనుకబడి ఉన్నారని, ప్రభుత్వాలు కూడా బీసీలను కేవలం ఓటుబ్యాంకు గానే చూస్తున్నాయని అందుచేత అదే ఓటుతో బీసీల సత్తాను నిరూపించడం కోసం బీసీ కులాలు పోటీ చేస్తున్న ప్రతీ చోట బీసీ అభ్యర్థులకు మాత్రమే ఓటు వేసి, అత్యధిక మెజారిటీతో గెలిపించి చూపాలని దొనికెన కోరారు. ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు కాదని, అందువలన బీసీ కులాలన్నీ ఏకమై, ఈ సర్పంచ్ ఎలక్షన్లను ఒక గేమ్ చేంజర్ అవకాశంగా ఉపయోగించుకోవాలని దొనికెన సూచించారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లతోనే స్థానిక సంస్థలకు ఎన్నికలు నిర్వహించాలనే ప్రయత్నం ప్రభుత్వాల నిర్లక్ష్యం వలన ఫలించలేదని, దీంతో చాలా స్థానాలను బీసీలు కోల్పోవలసి వచ్చిందని ఆయన ఆవేదన వ్యక్తపరిచారు. ఏదేమైనప్పటికీ ఈ సర్పంచ్ ఎలక్షన్లను వాడుకొని, బీసీలంతా ఏకత్రాటిపైకి వచ్చి, బీసీ అభ్యర్థులను నిలబెట్టి గెలిపించుకుంటే, ప్రభుత్వాలు పునరాలోచించి దిగివచ్చి బీసీల జనాభాకు తగినట్టుగా రిజర్వేషన్లను అమలు చేసే అవకాశం ఏర్పడుతుందని కుమారస్వామి అన్నారు. ఈ కార్యక్రమంలో డొనక ఐలయ్య, మిట్టకోల లక్ష్మణ్, సముద్రాల సోమన్న, కస్తూరి పులేందర్, కొత్తూరి రమేష్, చీకటి రమేష్ గౌడ్, చీకటి రాజేష్ గౌడ్, పిల్లి నాగరాజు, గంట దశరథం, గట్టు రాంబాబు, సాదు రాములు, గంధం చంద్ర మూర్తి, బౌరిశెట్టి అల్లా బాబు, తదితరులు పాల్గొన్నారు.

వాయిస్ టుడే

సోమవారం, డిసెంబరు 1, 2025

# బీదర్-మహేశ్వరం 765 కేవీ లైన్‌పై రైతుల ఆందోళన

## ::: పవర్ గ్రిడ్ అధికారులతో ఎంపీ వద్దిరాజు, మాజీ ఎమ్మెల్యే జైపాల్ భేటీ

హైదరాబాద్, నవంబర్ 30 : బీదర్-మహేశ్వరం (బేగరకంచ) 765 కేవీ హైటెన్షన్ విద్యుత్ లైన్ కారణంగా రంగారెడ్డి జిల్లా కడ్తాల్ మండలానికి చెందిన రైతులకు నష్టం వాటిల్లకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర మరియు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ సెంట్రల్ పవర్ గ్రిడ్ కార్పొరేషన్ అధికారులను కోరారు. ఈ విద్యుత్ లైన్ వల్ల విలువైన భూసంపద కోల్పోవాల్సిన పరిస్థితి తలెత్తుతుందని, పంట పొలాలకు తీవ్ర నష్టం జరిగే అవకాశముందని రైతులు ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో వారు మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్‌తో కలిసి ఎంపీ రవిచంద్రను సంప్రదించారు. పరిస్థితిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన సూచన మేరకు నవంబర్ 3న ఎంపీ రవిచంద్ర, జైపాల్ యాదవ్ నేతృత్వంలో రైతులు ఢిల్లీలో కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి మనోహర్ లాల్ ఖట్టర్‌ను కలిశారు. రైతులకు న్యాయం చేయాలని వారు వినతిపత్రం సమర్పించగా, మంత్రి ఖట్టర్ వెంటనే స్పందించి పవర్ గ్రిడ్ అధికారులకు తగు ఆదేశాలు ఇచ్చారు. ఆ దిశగా చర్యలలో భాగంగా పవర్ గ్రిడ్ కార్పొరేషన్ సీజీఎం బిపిన్ బీహారీ రథ్, సీనియర్ కన్సల్టెంట్ అశోక్, డీజీఎం సంతోష్ తదితరులు ఆదివారం హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని ఎంపీ రవిచంద్ర క్యాంప్ కార్యాలయంలో జరిగిన సమావేశానికి హాజరయ్యారు. సుమారు మూడు గంటల పాటు జరిగిన ఈ సమావేశంలో ఎంపీ రవిచంద్ర, మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ లతో పాటు సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి మరియు రైతులు పాల్గొన్నారు. ఎంపీ వద్దిరాజు, జైపాల్ యాదవ్ విద్యుత్ లైన్‌కు సంబంధించిన మ్యాపులను



చూపిస్తూ అధికారులకు పలు సూచనలు చేశారు. రైతుల ఆవేదన, ఆందోళనలు ఉన్నతాధికారులకు తెలియజేసి న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని సీజీఎం బిపిన్ బీహారీ రథ్ హామీ ఇచ్చారు. సమావేశంలో డీసీసీబీ డైరెక్టర్ గంపా వెంకటేష్, రైతులు పిప్పల వెంకటేష్, కడారి రామకృష్ణ, గూడూరు పెంటారెడ్డి, గూదె పర్వతాలు, జెల్లా శివరామకృష్ణ, క్యామ సత్యం, గూదె రాములు, కందికంటి శ్రీరాములు, అభిషేక్ రెడ్డి, గూదె రాజు, రాజేందర్ యాదవ్, వరికుప్పల యాదయ్య, కందికంటి కేశవులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



## గ్రామ పంచాయతీ ఎన్నికలు: నామినేషన్లకు కీలక సూచనలు

వాయిస్ టుడే ఝరాసంగం సంగారెడ్డి జిల్లా నవంబర్ 30 : సంగారెడ్డి జిల్లా రాయికోడ్ మండల అధికారులు, పోలీసులు గ్రామ పంచాయతీ 2వ విడత ఎన్నికల నేపథ్యంలో నామినేషన్ దాఖలు చేసే అభ్యర్థులకు పలు సూచనలు చేశారు. మండలంలోని 4,5 గ్రామాలను ఒక క్లస్టర్ గా విభజించి, 7 నామినేషన్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. అభ్యర్థులు ఉదయం 10:30 నుండి సాయంత్రం 5 గంటల మధ్య సంబంధిత పత్రాలతో నామినేషన్ దాఖలు చేయాలి. నామినేషన్ కేంద్రంలోకి అభ్యర్థితో పాటు కేవలం ఇద్దరిని మాత్రమే అనుమతిస్తారు. ర్యాలీగా వచ్చే అభ్యర్థులు ముందుగా తహశీల్దార్ అనుమతి పొందాలని, అవాంఛనీయ ఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారని అధికారులు తెలిపారు.



## సన్ రైస్ టైర్ వరల్డ్ అగ్నిప్రమాద ఘటనా స్థలాన్ని పరిశీలించిన భరత్ సింహా రెడ్డి

కుత్బుల్లాపూర్ నవంబర్ 30(వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధిలోని రాఘవేంద్ర కాలనీ సన్ రైస్ టైర్ వరల్డ్‌లో మొన్న తెల్లవారుజామున 4 గంటలకు జరిగిన భారీ అగ్నిప్రమాదంతో టైర్లు, మెషినరీ పూర్తిగా దగ్ధమై జరిగిన భారీ నష్టాన్ని పరిశీలించేందుకు, కార్ సెంటర్ యజమాని వెంకట్ రెడ్డి మరియు అక్కడి వర్కర్స్‌ను కాలనీ వాసులతో కలిసి పరామర్శించి, అగ్నిప్రమాదం జరిగిన ఘటనా స్థలాన్ని పరిశీలించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. ఈ సందర్శనలో కాలనీ అధ్యక్షులు నారాయణ, సతీష్ చక్రవర్తి, ఉమాపతి, వెంకట్ రెడ్డి, ఎం.ఎన్. రెడ్డి, నగర్ అధ్యక్షులు శ్రీకాంత్, శంకర్, ఎశ్వంత్, కోటేశ్వర్ రెడ్డి, శ్రవణ్ బోస్, శ్రీకాంత్, రోహిత్, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీ వద్దిరాజును సత్కరించిన ఈఏల్వీ ఫౌండేషన్ చైర్మన్ భాస్కర్



బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్రను ఈఏల్వీ ఫౌండేషన్ చైర్మన్ ఇరుగుదిండ్ల భాస్కర్ సత్కరించారు. హైదరాబాద్ బంజారాహిల్స్ ఎమ్మెల్యే కాలనీలోని క్యాంప్ కార్యాలయంలో ఎంపీ రవిచంద్రను ఆదివారం సాయంత్రం భాస్కర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛమిచ్చి శాలువాతో సన్మానించారు. ఎంపీ వద్దిరాజును భాస్కర్ కలిసిన సందర్భంగా ఆయన వెంట తమ్ముడు అశోక్, మిత్రులు దినేష్ రెడ్డి,జేన్నాయికోడే జగన్మోహన్ తదితరులు ఉన్నారు.



## మున్నూరు కాపు నూతన కార్యవర్గం ఎన్నిక!

### ::: అధ్యక్షులుగా పిల్లి శ్రీకాంత్ పటేల్

వాయిస్ టుడే న్యూస్, నవంబర్ 30 బోడుప్పల్ : మేడిపల్లి మండలము బోడుప్పల్ మున్సిపల్ కార్పొరేషన్ చెంగిచెర్లలో మున్నూరు కాపు కుల సభ్యులందరి సమక్షంలో సభ్యత్వం నమోదు కార్యక్రమం మరియు నూతన కార్యవర్గాన్ని ఘనంగా నిర్వహించుకున్నారు. అధ్యక్షులుగా పిల్లి శ్రీకాంత్ పటేల్ ను ఎన్నుకున్నారు. శ్రీకాంత్ పటేల్ మాట్లాడుతూ, నా మీద నమ్మకంతో నన్ను అధ్యక్షులుగా ఎన్నుకున్నందుకు నా కుల సభ్యులందరికీ ధన్యవాదాలు తెలియజేస్తూ చెంగిచెర్ల మున్నూరు కాపు సంఘాన్ని అంచలంచలుగా అభివృద్ధి పరుస్తూ అందరి ఐక్యమత్యంతో ముందుకు తీసుకెళ్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మాచర్ల శ్యాంసుందర్ పటేల్, కోశాధికారి దుంపల హరినాథ్ పటేల్, గౌరవ సలహాదారులు సూర్య ప్రకాష్ రావు పటేల్, సాయిబాబా పటేల్(ఎం.డి.ఎఫ్, టి.పి.యు.ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మున్నూరు కాపు సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.



## దూలపల్లి మల్టిపార్పస్ ఫంక్షన్ హాల్లో నరేంద్ర మోడీ ద మనకి బాత్ కార్యక్రమంలో మల్కాజ్గిరి ఎంపీ ఈటెల రాజేందర్ వారితో పాటు బిజెపి నాయకులు పాల్గొన్నారు

కుత్బుల్లాపూర్ నవంబర్ 30(వాయిస్ టుడే) : మన భారతదేశం తలెక్తుకునేలా పరిపాలన కొనసాగిస్తున్న, దేశ ప్రధాని నరేంద్రమోడిలిమన్ కీ బాత్ 128వ ఎపిసోడు నేడు భారతీయ జనతా పార్టీ కొంపల్లి శాఖ ఆధ్వర్యంలో, మున్సిపాలిటీ అధ్యక్షుని బాధ్యతలో దూలపల్లి మల్టిపార్పస్ ఫంక్షన్ హాల్లో ప్రత్యక్ష ప్రసారం ఏర్పాటు చేశాము. మల్కాజిగిరి పార్లమెంట్ సభ్యులు ఈటల రాజేందర్ ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసి మన్ కీ బాత్ వీక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు ఆదిరెడ్డి రాజిరెడ్డి, కౌన్సిల్ సభ్యులు జనార్ధన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి గిరివర్ధన్ రెడ్డి, విగ్నేష్, మన్ కీ బాత్ జిల్లా కన్వీనర్ వెంకటాచలం, రాష్ట్ర మహిళా మోర్చా అధికార ప్రతినిధి సరిత రావు, జిల్లా నాయకులు మల్లికార్జున్, బక్క శంకర్ రెడ్డి, వాసు, ప్రసన్న నాయుడు, మల్లికార్జున్, అశోక్, రావుల శేషగిరి, అంజలి, ఝాన్సీ రాణి, నాగమణి, కృష్ణవేణి, సహచర బూత్ అధ్యక్షులు రాజు, విజేందర్ రెడ్డి, కొంపల్లి పట్టణ నాయకులు నరసింహ, సత్యనారాయణ, దుర్గా, శ్రీనివాస్, మహేశ్వర్ రెడ్డి, ప్రకాష్ రావు, మధు, మహేందర్ సాగర్, మహేష్, శ్రీకాంత్, మురళి కృష్ణ, భారతి, భాస్కర్, సందీప్, శ్రీకాంత్ రెడ్డి, శివాజీ, శ్రీకాంత్, శేఖర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమ దిగ్విజయంలో తోడ్పాటు అందించిన దూరదర్శన్ టెలివిజన్ సిబ్బంది, ప్రింట్ ఢ పేపర్ మీడియా ప్రతినిధులకు, మున్సిపాలిటీ సిబ్బంది మరియు కొంపల్లి బీజేపీ కుటుంబ సభ్యులకు ధన్యవాదాలు.. పెద్దబుద్దుల సతీష్ సాగర్ కొంపల్లి పట్టణ అధ్యక్షులు బీజేపీ.



## వసంత్ విహార్ కాలనీలో నిర్మించబడిన సీసీ రోడ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమం

కుత్బుల్లాపూర్ నవంబర్ 30(వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి వసంత్ విహార్ కాలనీలో రూ.24.5 లక్షల వ్యయంతో నూతనంగా శాంక్షన్ అయి నిర్మించబడిన సీసీ రోడ్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని, ఎమ్మెల్యే కేపీ వివేకానంద కలిసి సీసీ రోడ్స్‌ను ప్రారంభించిన 132 జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి తదుపరి వసంత్ విహార్ కాలనీలో పర్యటించి, కాలనీలో ఉన్న ఇతర సమస్యల వివరాలను కాలనీ వాసులను అడిగి తెలుసుకున్న 132 జీడిమెట్ల డివిజన్ కార్పొరేటర్ చెరుకుపల్లి తారా చంద్రారెడ్డి ఈ కార్యక్రమంలో బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి, వసంత్ విహార్ కాలనీ అధ్యక్షులు దేవేంద్రబాబు నిమ్మగడ్డ, ఉపాధ్యక్షులు రాజేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి వేణు, ఝాన్సీ, చంద్రశేఖర్, వెంకట్, సోనీ, దీపిక తదితరులు పాల్గొన్నారు.



## మంత్రి పుట్టినరోజు సందర్భంగా మెగా రక్తదాన శిబిరం

నవంబర్ 30 (వాయిస్ టుడే) : తెలంగాణ రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పుట్టినరోజు సందర్భంగా క్యాతనపల్లి మున్సిపాలిటీ 9వ వార్డులో కాంగ్రెస్ నాయకులు గోపతి బానేష్, బ్లడ్ ఆర్గనైజర్ అబ్దుల్ రహీం ఆధ్వర్యంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యువత స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 50 యూనిట్ రక్తాన్ని దానం చేశారు శిబిరంలో సేకరించిన రక్తాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ బ్లడ్ బ్యాంక్ కు అందజేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా బ్లడ్ ఆర్గనైజర్ అబ్దుల్ రహీం మాట్లాడుతూ సేకరించిన రక్తం తల సేమియా, సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులు, చిన్నారులు, గర్భిణీ స్త్రీలు వంటి అత్యవసర అవసరాలు ఉన్న వారికి ప్రాణ రక్షణ కోసం వినియోగించబడుతుందన్నారు. .ఈ కార్యక్రమంలో డిసిసి అధ్యక్షులు పిన్నింటి రఘునాథ్ రెడ్డి ,జిల్లా అధికార ప్రతినిధి ఓడ్నాల శ్రీనివాస్ ,స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.



## నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పలు అభివృద్ధి పనులను ప్రారంభమించిన నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్‌రెడ్డి

కుత్బుల్లాపూర్ నవంబర్ 30(వాయిస్ టుడే) (కుత్బుల్లాపూర్ నియోజకవర్గం) నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ప్రగతి నగర్ లో 4 వ వార్డ్ మరియు 23 వ వార్డ్ లో రోడ్స్ డ్రైనేజీ, పాడువటం మరియు పార్కులు పూర్తిగా పాడువటంతో నిరుపయోగం ఉండ డంతో తీవ్ర ఇబ్బంది గురువాతున్న కాలనీ వాసులు గత నెల నియోజకవర్గ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సంప్రదించగా వారి సమ్యసపై స్పందించి సదరు కమీషనర్ పలు అభివృధి పాలీనులకు కార్పొరేషన్ ఫండ్స్ ద్వారా నిధులు మంజూరు చేయించారు ప్రారంభోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొని ప్రారంభమించిన్న నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి అనంతరం కాలనీ వాసులు శాలువాతో సత్కరించి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో( నఎంసీ) అధ్యక్షులు కొలన్ రాజశేఖర్ రెడ్డి, కోలన్ జీవన్ రెడ్డి నఎంసీ మహిళ అధ్యక్షురాలు శ్రీమతి కడియాల ఇందిరా ఆలేటి శ్రీనివాస్, ,23 వ డివిజన్ అధ్యక్షులు పోచంపల్లి రమేష్ బాబు,సిద్దనాల సంజీవ రెడ్డి, మాజీ సర్పంచ్ మైసిగారి శ్రీనివాస్ నాగరాజు,వీరబాబు, వాసు, శివ యాదవ్, మధు, నారాయణ రెడ్డి,సురేంద్ర యాదవ్ తులసి దాస్ , ప్రశాంత్ రెడ్డి, మురళి కృష్ణ, అది రెడ్డి, కోటేశ్వర్ రావు, సుధాకర్, రవీందర్ రెడ్డి, రమణ, మరియు కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.



## అయ్యప్ప స్వామి మహా పడి పూజా కార్యక్రమంలో పాల్గొన్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకులు శంభీపూర్ క్రిష్ణ ..

కుత్బుల్లాపూర్ నవంబర్ 30(వాయిస్ టుడే) : కుత్బుల్లాపూర్ నియోజకవర్గం దుండిగల్ మున్సిపాలిటీ మల్లంపేట్ లోని గురుస్వామి శ్రీ బెజ్గాం శ్రీనివాస్ గుప్తా వారు వారి నివాసంలో ఏర్పాటు చేసుకున్న అయ్యప్ప స్వామి మహా పడిపూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు ప్రత్యేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 21,22 వ వార్డు ప్రెసిడెంట్లు నవీన్, శ్రీధర్ మరియు అయ్యప్ప స్వాములు తదితరులు పాల్గొన్నారు..



## కోడిపందాలు ఆడుతున్న వ్యక్తులు అరెస్ట్!

వాయిస్ టుడే న్యూస్, నవంబర్ 30 మేడిపల్లి : మేడిపల్లి పీఎస్ పరిధిలోగల చెంగిచెర్ల మేకల మండి దగ్గరలో గల నిర్మానుష ప్రాంతంలో కొందరు వ్యక్తులు ఆదివారం మధ్యాహ్న సమయంలో కోడి పందాలు ఆడుతున్నారని పక్క సమాచారం మేరకు మేడిపల్లి సీఐ ఆర్. గోవిందరెడ్డి ఆదేశానుసారం ఎస్సై శీను, మరియు సిబ్బంది, హెడ్ కానిస్టేబుల్ రాము, హెచ్.జి శీను సంఘటన స్థలానికి చేరుకొని చూడగా కొందరు వ్యక్తులు కోడి పందాలు నిర్వహిస్తున్నారు. అట్టి వ్యక్తులను (15) మందిని అదుపులోకి తీసుకొని మేడిపల్లి పీఎస్ కు తరలించడం జరిగింది. నేరస్తుల నుంచి రెండు కోళ్లు, రెండు కత్తులు, మొబైల్ ఫోన్లు, 18 వేల నగదును సీజ్ చేయడం జరిగిందని ఈ వ్యక్తులపై కేసు నమోదు చేసి విచారణ చేపడుతున్నామని సిఐ. ఆర్. గోవిందరెడ్డి తెలిపారు.